నేడు వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు

మంగళగిరి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా శనివారం సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణా రెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు హాజరవుతారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మంగళగిరి: నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటు నిమిత్తం శనివారం నగరంలోని ఏపీ టిడ్కో జగనన్న కాలనీ 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో ఉదయం ఎనిమిది నుంచి 11 వరకు సరఫరా ఉండదని డీఈఈ అక్కల సత్యనారాయణ చెప్పారు. నగరంలోని ఆర్టీసీ డిపో రోడ్డు, రాయల్ ఫంక్షన్ హాలు నుంచి ఎమ్మెల్యే కార్యాలయం వరకు బీఎండబ్ల్యూ షోరూం నుంచి కూరగాయల మార్కెట్ వరకు, టిడ్కో గృహ సముదాయాల్లో సరఫరాకు అంతరాయం కలుగనుందని తెలిపారు.

పేదవాడికి అండగా సంక్షేమ ప్రభుత్వం

- ఎమ్మెల్యే ఆర్కే
- కొప్పురావుకాలనీలో పెన్షన్లు పంపిణీ

మంగళగిరి: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రతి నెలా ఒకటో తేదీనే పెన్షన్‌లు ఇంటి వద్దనే అందజేయడంలో దేశంలోనే చారిత్రాత్మకమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పేర్కొన్నారు. నగరంలో నూతనంగా మంజూరైన 650 పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కొప్పురావుకాలనీలో శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఎలాంటి అవినీతికి తావు లేకుండా పెన్షన్లను అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. నగరంలో ఇప్పటికే 14 వేలకు పైగా అర్హులకు పెన్షన్‌లు అందజేస్తుండగా పలు సాంకేతిక కారణాలతో



పెన్షన్ పంపిణీ అందజేస్తున్న వలంటీర్ పక్కన ఎమ్మెల్యే ఆర్కే

ఆగిన మరో 650 మంది అర్హులకు మంజూరైన పెన్షన్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ యు. శారదాదేవి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు మాచర్ల సుధాకర్ పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: ఒకటో తేదీన తెల్లవారుజామున పాత పెన్షన్లతో పాటు, కొత్తగా అర్హులైన వారికి పెన్షన్లు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు కత్తిక మల్లికార్జునరావు, ముదిగొండ ప్రకాష్ పంపిణీ చేశారు.

దుగ్గిరాల మండలంలో...

దుగ్గిరాల మండల పరిధిలోని చింతలపూడిలో కొత్తగా మంజూరు అయిన పింఛన్లను ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి తాడిబోయిన రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి టి.మణికంఠ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, నాయకులు నల్లనూకల కోటి యాదవ్, పిల్లి ధర్మరత్నం, జమ్ముల లోకేష్, మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.

తెనాలి వెళ్లి పెన్షన్ అందజేసిన వలంటీర్

తాడేపల్లిరూరల్: ఉండవల్లికి చెందిన వలంటీర్ తెనాలి వెళ్లి పెన్షన్ అందజేశారు. వివరాలు.. ఉండవల్లికి చెందిన కె.కుమార్‌రెడ్డి మానసిక వ్యాధితో బాధపడుతుండడంతో ఆయన బంధువులు తెనాలి సమీపంలోని ఎరుకలపూడి వద్ద ఉన్న మానసిక వైద్య కేంద్రంలో చికిత్స నిమిత్తం చేర్పించారు. విషయం తెలుసుకున్న వలంటీర్ అనూష ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేసింది.



చిరువ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ

తాడేపల్లిరూరల్: చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఆర్థిక సాయంతో పలువురికి తోపుడు బండ్లను పార్టీ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. దివంగత నేత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా తాడేపల్లి పట్టణ పరిధిలోని క్రిస్టియన్‌పేటలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు పాల్గొని పంపిణీ చేశారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి శనివారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలో అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అందించిన ఆర్థిక సాయాన్ని స్థానిక మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజీ శుక్రవారం అందజేశారు.

షారోన్ చిల్డ్రన్స్ హోమ్‌కు నిత్యావసరాలు అందజేత

మంగళగిరి: కార్పొరేషన్ పరిధి నవులూరులోని షారోన్ చిల్డ్రన్స్ హోమ్ నిత్యావసరాలు శుక్రవారం అందజేశారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ ఆవిర్భవించి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బ్యాంకు సిబ్బంది పంపిణీ చేశారు. గుంటూరు మాడ్యూల్ డెప్యూటీ జనరల్ సెక్రటరీ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్‌బీఓ మంగళగిరి హెచ్‌ఆర్ శివయ్య, ఏజీఎస్‌లు కోటిరెడ్డి, నరేంద్ర కుమార్, ఎల్‌ఎస్ మేగ్యా నాయక్ పాల్గొన్నారు.

మూలాంకురేశ్వరికి ఖడ్గమాల పూజలు

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని మూలాంకురేశ్వరి అమ్మవారికి శ్రావణమాస శుక్రవారం సందర్భంగా భక్తులు పూజలు చేశారు. ఉదయాన్నే అర్చకులు అయ్యన్నశాస్త్రి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేసి కుంకుమతో ఖడ్గమాల పూజలు చేశారు.

గంగమ్మకు భక్తుల పూజలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గంగమ్మకు శుక్రవారం భక్తులు పూజలు చేశారు. కొండవీటి రెడ్డిరాజుల కాలం నాటి గంగమ్మ విగ్రహం కావడంతో వర్షాలు పడేందుకు అమ్మకు పూజలు చేసి బిందెలతో నీరు పోయడం ఇక్కడి భక్తుల విశ్వాసం. ఉదయాన్నే అల్లంవారిపాలెం, ఫిరంగిపురం గ్రామాలకు చెందిన భక్తులు నీటిబిందెలతో వచ్చి గంగమ్మకు అభిషేకాలు చేశారు. కొబ్బరికాయలు కొట్టి, వడపప్పు,పానకం నైవేద్యంగా సమర్పించారు.

గ్రామ సచివాలయంలో పెన్షన్‌ల పంపిణీ

మేడికొండూరు: రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా పింఛన్ల పంపిణీ జరుగుతోందని జెడ్పిటీసీ సభ్యుడు కందుల సిద్దయ్య అన్నారు. మండల పరిధిలోని డోగిపర్రు గ్రామంలో శుక్రవారం నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డోగిపర్రు గ్రామ సర్పంచ్ సామ్రాజ్యం, పంచాయతీ కార్యదర్శి బి.రమేష్, వెల్ఫేర్ సెక్రటరీ దివ్య పాల్గొన్నారు.

నిడుముక్కల(తాడికొండ): పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి పేదవాడికి పింఛన్‌లు, సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందని మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, సర్పంచి మాదాసు రత్నకుమారి అన్నారు. శుక్రవారం కొత్తగా మంజూరైన పింఛన్లను అందజేశారు.